

ముందే వచ్చిన కాలుష్య సంక్షోభం.

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -136 బుధవారం 4 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై దృష్టి

- మహారాష్ట్రతో నిరంతర చర్చలు జరపాలి
- ముంపు భూముల వివరాలు, పరిహారంపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలి
- సాగునీటి శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



హైదరాబాద్,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూముల వివరాలు, పరిహారం చెల్లింపు, గతంలో కుదిరిన ఒప్పందాలు తదితర అంశాలపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ విషయంలో ఎలాంటి సందిగ్ధత లేకుండా అవసరమైన పత్రాలను సిద్ధం చేసి మహారాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు.మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి తుమ్మిడిహెట్టి బ్యారేజీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ప్రాజెక్టుకు సంబంధించిన మిగతా2లో...

శాసనమండలి ప్రాంగణం అభివృద్ధికి కార్యాచరణ

- పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యం: సీఎస్ సంజయ్ జాజు



సైబర్ నేర ముఠాలపై ఉక్కుపాదం

- 13 రాష్ట్రాలు, 11 కేంద్ర సంస్థలతో హైదరాబాద్‌లో సమన్వయ సమావేశం




హైదరాబాద్,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న సైబర్ నేర ముఠాలను కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని టీజీఐసీసీసీలో జాయింట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ టీమ్ (జేసీసీటీ-4) సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి 13 రాష్ట్రాల నుంచి 45 మంది పోలీసు అధికారులు, 11 కేంద్ర, ఇతర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, సైబర్ నేరాల కేంద్రాల గుర్తింపు, నేర ముఠాలపై ఉమ్మడి దర్యాప్తు, సంయుక్త దాడులపై చర్చించారు. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సమావేశాన్ని ప్రారంభించగా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి,మిగతా2లో...

ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. పాలకుల కరువు!

- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతోనే రైతులకు సాగునీటి కష్టాలు
- గోదావరి, కృష్ణా నుంచి సముద్రంలోకి వృథాగా వెళ్తున్న వందల టీఎంసీల నీరు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో నదులు ప్రవహిస్తున్నా రైతుల పొలాలకు సాగునీరు అందకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతోనే కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను నిర్లక్ష్యం మిగతా2లో...



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పొడిగింపు

- నామినేషన్ల దాఖలు చివరి రోజు వరకు దరఖాస్తుకు అవకాశం

హైదరాబాద్,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువును పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తి పలువురు పట్టభద్రులు నమోదు మిగతా2లో...

కేసీఆర్ పాలనలో తెలంగాణ సంపద దోపిడీ

- 74 వేల ఉద్యోగాలు కల్పించాం..
- మరోసారి భూసర్వేకు చర్యలు: పొంగులేటి



హైదరాబాద్,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): :గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపదను స్వార్థ ప్రయోజనాల కోసం కొల్లగొట్టారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ పేదల కష్టాలను పట్టించుకోలేదని విమర్శించారు. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తాం ప్రతిపక్ష నేతలు తమ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. గతంలో వరి సాగు చేసే రైతులను నిరుత్సాహపరిచారని, మిగతా2లో...

కూటమి కుమ్మేసింది!

ఏపీ పుర పోరు: కార్పొరేషన్లు, మున్సిపాలిటీలపై కూటమి జెండాల రెపరెపలు

- 12 కార్పొరేషన్లు, 83 మునిసిపాలిటీలు కూటమికే!
- ఆదోని, నెల్లిమర్లలో జనసేన, టీడీపీ రెబల్స్ గెలుపు
- జనసేన 100 శాతం స్ట్రైక్ రేట్ రిపీట్
- పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ 'గ్లాసు' గలగల
- 3 లక్షల రికార్డు మెజార్టీతో విశాఖ పీఠంపై శ్రీవాణి
- గుంటూరు మేయర్‌గా లక్ష్మీ అపర్ణ.. లక్షకు పైగా మెజార్టీ
- విజయవాడలో ఆధిక్యంలో వంగవీటి రాధా



అమరావతి,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో అధికార టీడీపీ నేతృత్వంలోని కూటమి ఆధిక్యం ప్రదర్శించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో ముందం జలో నిలిచారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు పలు ప్రాంతాల్లో ఆధిక్యం కనబరిచారు. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కడపతో పాటు ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలోనూ టీడీపీ కూటమి అభ్యర్థులు పైచేయి సాధించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. కార్పొరేషన్లలో కూటమి ఆధిక్యం రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థులు మిగతా2లో...

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై సర్కారు దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

వివిధ అంశాలపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అంతర్రాష్ట్ర సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటూ ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. **ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం** బ్యారేజీ నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన నిధులను ఇరు రాష్ట్రాల ఉమ్మడి ఖాతాలో జమ చేసేందుకు కూడా సిద్ధమని తెలిపారు. ముంపునకు సంబంధించిన భూములపై మహారాష్ట్ర ప్రభుత్వం స్వయంగా సర్వే నిర్వహించినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

అంతర్రాష్ట్ర సమన్వయానికి ప్రాధాన్యం

తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో మహారాష్ట్రతో సమన్వయం ఎంతో ముఖ్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆ రాష్ట్ర అధికారులు కోరిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని, గతంలో చేసుకున్న ఒప్పందాలు, ఇతర సాంకేతిక అంశాలకు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. చర్చల్లో పురోగతి సాధించేలా నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టతతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో తెలంగాణ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ రమేష్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. పాలకులు సృష్టించిన కరువు!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, పాలకులు తెచ్చిన కరువని వ్యాఖ్యానించారు.తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి మల్లావరుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ పలువురు సాహితీవేత్తలను సత్కరించి పురస్కారాలు అందజేశారు. 2024-25 సంవత్సరానికి చెమన్‌సింగ్, 2025-26 సంవత్సరానికి సంగిశెట్టి శ్రీనివాస్‌కు స్మారక పురస్కారాలు ప్రదానం చేశారు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో సేవలందించిన తిరునగరి దేవకిదేవి, కవ్వంపల్లి స్వామిని సన్మానించారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణకు ఈ ఏడాది ఏడున్నర నెలల్లో గోదావరి నది ద్వారా 750 టీఎంసీలు, కృష్ణా నది ద్వారా 258 టీఎంసీల నీరు వచ్చిందని తెలిపారు. మొత్తం వెయ్యి టీఎంసీలకు పైగా నీరు అందుబాటులోకి వచ్చినప్పటికీ, వాటిని సమర్థంగా వినియోగించుకోలేకపోవడం బాధాకరమన్నారు. వందల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిపోతున్నా రాష్ట్రంలోని రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కేసీఆర్‌పై అక్కసుతోనే గత ప్రభుత్వం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను పక్కనపెట్టడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. గోదావరి జలాలను తెలంగాణ పొలాలకు మళ్లించి రైతులకు సాగునీరు అందించడమే కవి మల్లావరుల సదాశివుడికి అందించే నిజమైన నివాళి అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.

డబ్బులు జమయ్యాకే చెక్కుల పంపిణీ

● ఖేలో ఇండియా క్రీడాకారులకు ఇబ్బందులు పెట్టొద్దు.. అధికారుల సమన్వయ లోపంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): : ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో క్రీడాశాఖ అధికారుల తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖలో బాధ్యతారాహిత్యం, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.**నిధుల బదిలీ తర్వాతే చెక్కులు** ఆర్థిక శాఖ నుంచి స్పోర్ట్స్ అథారిటీకి నిధులు బదిలీ అయిన తర్వాతే క్రీడాకారులకు చెక్కులు పంపిణీ చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఖాతాల్లో డబ్బులు లేకుండానే చెక్కులు ఇచ్చి క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని సూచించారు. నిధుల లభ్యతను నిర్ధారించుకున్న తర్వాతే చెక్కుల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు.**క్రీడాకారులను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు** క్రీడాకారులు, వారి తల్లిదండ్రులను పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడం మంచి పద్ధతి కాదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. క్రీడాకారులకు అందాల్సిన ప్రోత్సాహకాలు, ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచుకుని సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోలేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.ఈ నెల 25న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు ఓటరు నమోదు దరఖాస్తులపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు.

కూటమి కుమ్మేసింది!

(మొదటి పేజీ తరువాయి)

ఆధిక్యంలో కొనసాగారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కడప, మచిలీపట్నం తదితర కార్పొరేషన్లలో కూటమి అభ్యర్థులు ముందంజలో నిలిచారు. విశాఖపట్నం మేయర్ అభ్యర్థిగా టీడీపీ తరఫున బరిలో ఉన్న ముక్కా శ్రావణి ఆధిక్యం సాధించారు. గుంటూరు, తిరుపతి, చిత్తూరు, మచిలీపట్నం కార్పొరేషన్లలోనూ టీడీపీ అభ్యర్థులు విజయం సాధించినట్లు ఫలితాలు వెల్లడయ్యాయి. **పులివెందులలో టీడీపీకి ఆధిక్యం** మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ కూటమి ఆధిక్యం సాధించడం ఎన్నికల ఫలితాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కడప జిల్లాలోని పలు పట్టణ స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులు విజయాలు నమోదు చేశారు. అయితే నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీలో వైసీపీ విజయం సాధించింది. కొన్ని ప్రాంతాల్లో స్వతంత్ర అభ్యర్థులు కూడా గెలుపొందారు. **మున్సిపాలిటీల్లోనూ కూటమి హవా** రాష్ట్రంలోని 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో జరిగిన ఎన్నికల లెక్కింపులోనూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శించారు. టీడీపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందగా, జనసేన, బీజేపీ అభ్యర్థులు కూడా పలు పట్టణాల్లో విజయాలు సాధించారు. వైసీపీ కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గెలుపొందింది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని పులివెందుల, ప్రొద్దుటూరు, పుంగనూరు వంటి పట్టణాల్లో కూటమి అభ్యర్థుల విజయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. **వామపక్షాలకూ కొన్ని స్థానాలు** మరోవైపు వామపక్ష పార్టీలు కూడా కొన్ని ప్రాంతాల్లో తమ ఉనికిని చాటుకున్నాయి. గత ఎన్నికల్లో విశాఖపట్నం, విజయవాడ కార్పొరేషన్లలో గెలుచుకున్న ఒక్కో కార్పొరేటర్ స్థానాన్ని సీపీఐ(ఎం) నిలబెట్టుకుంది. మరికొన్ని మున్సిపాలిటీల్లో వార్డు సభ్యుల స్థానాలను సాధించింది.మొత్తంగా పట్టణ ప్రాంతాల్లో జరిగిన ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. అధికార కూటమి, ప్రధాన ప్రతి పక్ష వైసీపీ మధ్య జరిగిన పోటీలో పలు కీలక ప్రాంతా ల్లో కూటమి అధిక్యం సాధించింది. మిగిలిన స్థానాల లెక్కింపు, తుది ఫలితాలతో పూర్తి రాజకీయ చిత్రం స్పష్టమైంది.

శాసనమండలి ప్రాంగణం అభివృద్ధికి కార్యాచరణ

హైదరాబాద్,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో చేపట్టనున్న అభివృద్ధి, సుందరీకరణ పనుల ప్రతిపాదనలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పరిశీలించారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి ప్రాంగణాన్ని సందర్శించి ప్రతిపాదిత పనులపై అధికారులతో సమీక్షించారు.శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్, వైస్ చైర్మన్, డిప్యూటీ స్పీకర్లతోపాటు ఉభయ సభల కార్యదర్శుల నివాస భవనాల నిర్మాణ ప్రతిపాదనలపై వివరాలు తెలుసుకున్నారు. అనుబంధ భవనం, పరిపాలనా భవనం, శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం, పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు.**పచ్చదనానికి విఘాతం కలగొద్దు**శాసనసభ ప్రాంగణ విస్తరణ కోసం పర్యాటక శాఖకు చెందిన భూమితోపాటు డీజీపీ కార్యాలయానికి చెందిన కొంత భూమిని బదిలీ చేసే అంశంపై చర్చించారు. అభివృద్ధి పనుల సందర్భంగా పర్యావరణానికి హాని కలగకుండా, ఇప్పటికే ఉన్న పచ్చదనాన్ని పరిరక్షించాలని సంజయ్ జాజు అధికారులకు సూచించారు. పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధి విధానాలతో ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలో గుడిసెలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని బీసీ సంక్షేమ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నాంపల్లిలోని గృహకల్ప కార్యాలయంలో గోషామహల్, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, ముషీరాబాద్ నియోజకవర్గాల లబ్ధిదారుల ఎంపికకు కంప్యూటరైజ్డ్ ఈ-లాటరీ నిర్వహించారు. ఎంపికైన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. **నియోజకవర్గానికి 5,500 ఇళ్లు** ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు విడతల్లో కలిపి 5,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. తొలి విడతలో 3,500, రెండో విడతలో 2,000 ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. మొదటి విడత పనులు చాలావరకు పూర్తయ్యాయని, నిర్మాణ పనుల పురోగతిని బట్టి దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. సొంత స్థలం ఉన్నవారికి ప్రాధాన్యత నిస్తూ ఎల్-1 కేటగిరీలో సుమారు 2 వేల మందికి త్వరలో ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. **ఉపాధికి దగ్గరగా నివాసాలు** హైదరాబాద్‌లో స్థలాల కొరత ఉన్నప్పటికీ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు విలువైన ప్రభుత్వ భూములను వినియోగిస్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ, పోలీసు శాఖలకు చెందిన భూముల్లోనూ ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణానికి అనువైన భూములను సేకరిస్తున్నామని, వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేలా పనులు వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు.

కేసీఆర్ పాలనలో తెలంగాణ సంపద దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వం మాత్రం రైతులు పండించిన పంటకు బోనస్ అందించి అండగా నిలిచిందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.**ప్రతి భూమికి భరోసా కల్పిస్తాం** రాష్ట్రంలో అర్హులైన పేదలకు 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు అందించామని మంత్రి తెలిపారు. సుమారు 120 ఏళ్ల క్రితం జరిగిన భూసర్వేల కారణంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా భూముల సమగ్ర సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో భూసర్వే నిర్వహించాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. సర్వే అనంతరం మ్యాపులతో కూడిన భూధార్ అందించి భూయజమానులకు భరోసా కల్పిస్తామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పొంగులేటి పేర్కొన్నారు.

పాత ఓటర్లకు ఈసీ ఊరట

- జాబితాలో పేరు లేకున్నా ఫారం-6తో మళ్లీ నమోదు చేసుకోవచ్చు



హైదరాబాద్,నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):
ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన పాత ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం ఊరటనిచ్చింది. గతంలో ఓటరుగా నమోదై ఉండి, ప్రస్తుతం జాబితాలో పేరు కనిపించని వారు తిరిగి ఓటు హక్కు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

గతంలో ఓటరుగా ఉన్నప్పటికీ మళ్లీ దరఖాస్తు చేయడం తప్పుడు ప్రకటన కిందకు రాదని తెలిపింది. ఫారం-6లోని 'మొదటిసారి ఓటు నమోదు' అనే ప్రకటనపై పాత ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ కారణంతో వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద చర్యలు తీసుకోవద్దని ఎన్నికల నమోదు అధికారులకు సూచించింది.అయితే దరఖాస్తుదారులు మరో పార్లమెంటరీ లేదా అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికే ఓటరుగా నమోదై ఉండకూడదని స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టులో ఈ అంశంపై జరిగిన విచారణ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్గదర్శకాలు జారీ చేసింది.ఈ సూచనలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు పంపించింది. స్థానిక భాషల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. దీంతో ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన పాత ఓటర్లు తిరిగి నమోదు చేసుకునేందుకు అవకాశం కలిగింది.

సైబర్ నేర ముఠాలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, ఐ4సీ సీఈవో రాజేష్ కుమార్ పాల్గొన్నారు.**నేరం జరగకముందే అడ్డుకోవాలి** సైబర్ నేరాలు వ్యవస్థీకృత పరిశ్రమగా మారాయని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. నేరం జరిగిన తర్వాత డబ్బు తిరిగి రాబట్టడం కంటే, ముందుగానే మోసాలను అడ్డుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. నేరగాళ్లకు బాధితులను చేరుకునే మార్గాలు, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు అందకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 202425లో దేశవ్యాప్తంగా సైబర్ నేరాల ఫిర్యాదులు 24 శాతం పెరగగా, తెలంగాణలో 3 శాతం తగ్గాయని తెలిపారు. రాష్ట్రంలో సైబర్ మోసాల వల్ల జరిగిన ఆర్థిక నష్టాలు 20 శాతం తగ్గినట్లు వెల్లడించారు.**బహుళ రాష్ట్రాల సమన్వయంతో దర్యాప్తు**సైబర్ నేరగాళ్లు రాష్ట్రాల సరిహద్దులు దాటి ఒకే నెట్‌వర్క్‌గా పనిచేస్తున్నారని శిఖా గోయల్ తెలిపారు. నేరాల సూత్రధారులు, ఆర్థిక సహాయకులను గుర్తించేందుకు కేసుల వారీ దర్యాప్తు విధానానికి బదులుగా నిధా ఆధారిత సమన్వయ దర్యాప్తు అవసరమని పేర్కొన్నారు. అనుమానాస్పద లావాదేవీలను నిలిపివేసేలా బ్యాంకులకు మార్గదర్శకాలు, ఏకీకృత దర్యాప్తు వేదిక, దేశవ్యాప్త ప్రత్యేక ఆపరేషన్లపై సమావేశంలో చర్చించారు. మహిళలు, చిన్నారులపై ఆన్‌లైన్ నేరాలు, కృత్రిమ మేధ వినియోగం, మ్యూల్ బ్యాంకు ఖాతాల ద్వారా జరిగే మోసాల నియంత్రణపైనా అధికారులు చర్చించారు. సమావేశంలో రూపొందించిన సిఫార్సులను అన్ని రాష్ట్రాలు, సంబంధిత సంస్థలకు పంపించి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి



వైరా/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):
వైరా నుంచి ఖమ్మం వెళ్లే ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన దాసరి ప్రభాకర్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై దర్యాప్తు చేపట్టి ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం వివరాలను సేకరిస్తున్నారు.

అక్రమ రోడ్డు తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

పాడైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి -సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ డిమాండ్



జనగామ/చేర్యాల, నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):
అనుమతులు లేకుండా విచ్చలవిడిగా రోడ్లను తవ్వి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ధ్వంసమైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని అంగడి బజార్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. నీటి సరఫరా పైపులైన్ల పేరుతో అంగడి బజార్ చౌరస్తా నుంచి పెద్దమ్మగడ్డ వరకు పలుచోట్ల రోడ్లను తవ్వడంతో బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. ఆకునూరు వరకు కూడా పలుచోట్ల రోడ్లు తవ్వి పూడ్చకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గం మీదుగా నంగునూరు, హుస్నాబాద్ తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారని, రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి, అనుమతులు లేకుండా రోడ్లు తవ్విన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరారు. అధికారులు స్పందించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఈరి భూమయ్య, మండల కోశాధికారి నంగి కనకయ్య, మండల కార్యవర్గ సభ్యులు గూడెపు సుదర్శన్, పోషబోయిన పరమశేఖర్ పాల్గొన్నారు.

ఎన్జీవోల సహకారంతో వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ

ఇద్దరు నిరుపేద వికలాంగులకు ఆలింకో వాహనాలు అందజేత



జనగామ/చేర్యాల, నవంబర్ 03 (జర్నలిస్ట్ వార్త): సమాజంలో అందరిలా స్వేచ్ఛగా తిరుగుతూ తమ పనులు తాము చేసుకునేందుకు వికలాంగులకు సహాయక వాహనాలు ఎంతో అవసరమని, అలాంటి వాహనాలు అందడం తమకు ఎంతో సంతోషంగా ఉందని చేర్యాల మండలానికి చెందిన వికలాంగులు ఆనందం వ్యక్తం చేశారు. చేర్యాల మండలం చుంచనకోట, గుర్జకుంట గ్రామాలకు చెందిన ఇద్దరు నిరుపేద వికలాంగులకు ఎన్జీవోస్ సంస్థ ఆధ్వర్యంలో ఆలింకో బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో చుంచనకోట సర్పంచ్, సామాజిక సేవకుడు గొర్రె శ్రీనివాస్, ఎన్‌పీఆర్‌డీ చేర్యాల డివిజన్ అధ్యక్షుడు తుమ్మలపల్లి అనిల్, ఉపాధ్యక్షుడు తాండ్ర సత్తయ్య కలిసి లబ్ధిదారులకు వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద వికలాంగులైన కర్రె రేణుక, గొల్లపల్లి వెంకటేశ్వర్లకు బ్యాటరీ ట్రై సైకిళ్లు అందించడం ద్వారా వారు స్వేచ్ఛగా ప్రయాణించడంతో పాటు రోజువారీ పనులను ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా చేసుకునేందుకు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఈ వాహనాలు వారి జీవనంలో స్వావలంబనకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. వాహనాలు అందుకున్న లబ్ధిదారులు గొర్రె శ్రీనివాస్, తుమ్మలపల్లి అనిల్, తాండ్ర సత్తయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.7 కోట్లతో ఇనుగుర్తిలో నూతన పాఠశాల భవనాలు

నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



కేసముద్రం/నవంబర్ 03 (జర్నలిస్ట్ వార్త): మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన పాఠశాల భవనాల పనులను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. తన పెద్దన్న కిషన్ తదితర కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి చేరుకున్న ఆయన నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.ఎంపీ రవిచంద్ర చదువుకున్న ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో ఆధునిక సౌకర్యాలతో నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణాల కోసం ఎంపీ కుటుంబ సభ్యులు రూ.కోటి విరాళంగా అందించగా, చమురు సంస్థల నుంచి మరో రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించారు. మొత్తం రూ.7 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా ఎంపీ నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడవద్దని కాంట్రాక్టర్లు, సంబంధిత సిబ్బందికి స్పష్టం చేశారు. పనులను వేగవంతం చేసి వచ్చే ఏడాది మే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా అన్ని ఆధునిక వసతులతో పాఠశాల భవనాలను నిర్మించాలని సూచించారు.

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు అంగన్వాడీలే పునాది

అక్షరాభ్యాసం, మొదటి ముద్ద కార్యక్రమం ప్రారంభించిన కౌన్సిలర్ జాటోత్ సుజాత హరీష్ నాయక్



కేసముద్రం/ నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): చిన్నారులకు చిన్ననాటి నుంచే విద్యాబుద్ధులు నేర్పించడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని ఒకటో వార్డు కౌన్సిలర్ జాటోత్ సుజాత హరీష్ నాయక్ అన్నారు. మంగళవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ హరిజనవాడలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మొదటి ముద్ద' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లల్లో విద్యపై ఆసక్తి పెంపొందించి, పునాది స్థాయి నుంచే నాణ్యమైన విద్య అందిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మొదటి ముద్ద కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 35 వేల మంది చిన్నారులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, సంపూర్ణ ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం నిరంతరం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బండి సుజాత, గార్లపాటి అనిత, అంగన్వాడీ టీచర్ జీడికంటి పుష్పలీల, ఆయా నర్సింగం రేణుక, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో జిల్లా ప్రథమ స్థానమే లక్ష్యం

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బాల్యవివాహాలు, మాదకద్రవ్యాలు, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించాలి -జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్/ నవంబర్ 03 (జర్నలిస్ట్ వార్త):
ఇంటర్మీడియట్ పరీక్షల్లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతోపాటు చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదర్, జిల్లాలోని పది జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మూడు నెలల్లో సిలబస్ పూర్తి చేసి మిగిలిన సమయాన్ని పునశ్చరణ, పరీక్షల సాధనకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి మరింత ప్రోత్సహించాలని, వెనుకబడిన విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వారాంతపు పరీక్షలు, నమూనా ప్రశ్నపత్రాల ద్వారా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. పది కళాశాలల్లోనూ నాణ్యమైన విద్య అందించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని స్పష్టం చేశారు.

సామాజిక సమస్యలపై చైతన్యం

విద్యార్థులు బాల్యవివాహాలు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, మైనర్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీసు సిబ్బంది సహకారంతో మండలాల వారీగా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాలికలు బాల్యవివాహాల బారిన పడకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని, నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. కళాశాలలకు గైర్హాజరవుతున్న, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి తిరిగి విద్య కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వసతి గృహాల్లో మెనూ తప్పనిసరి

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లో ఉమ్మడి ఆహార పట్టికను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, మెనూ ప్రకారం గుడ్లు, చికెన్, పండ్లు అందించాలన్నారు. వంట గదులు, భోజనశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, భోజనానికి సంబంధించిన ఫొటోలను సంబంధిత గ్రూపుల్లో పంపించాలని ఆదేశించారు. మెనూ అమలులో నిర్లక్ష్యం, ఆహార నాణ్యతలో లోపాలు గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యపుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని విద్యార్థులకు సకాలంలో అందించాలని సూచించారు. మంజూరైన ఆర్వో ప్లాంట్లను సక్రమంగా నిర్వహిస్తూ స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. కళాశాలల పని వేళలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా సంబంధిత డిపో మేనేజర్‌కు సూచనలు జారీ చేస్తామని తెలిపారు. ఎఫ్‌ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఆదేశించారు.

ఉపాధి అవకాశాలపై దిశానిర్దేశం

ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించాలని కలెక్టర్ సూచించారు. కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, భవిష్యత్తు ప్రణాళికలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కళాశాల హాజరును క్రమబద్ధీకరించేలా చూడాలని కోరారు. జిల్లా ఉత్తమ ఫలితాల సాధనకు అధికారులు, ప్రిన్సిపాళ్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్నేహ శబరిష్ స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదర్, పది జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళి వేడుకల్లో భద్రతకు పెద్దపీట వేయాలి

టపాసుల దుకాణాల కేటాయింపులో పారదర్శకత పాటించాలి

-భద్రతా ప్రమాణాల్లో రాజీ పడొద్దు.. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్





ఖమ్మం/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): దీపావళి వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, సురక్షితంగా జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, టపాసుల విక్రయాలు, వినియోగం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి దీపావళి వేడుకలు, టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, విక్రయదారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8న దీపావళి పండుగ ఉన్న నేపథ్యంలో టపాసుల విక్రయ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పండుగ అనంతరం వారం రోజుల వరకు టపాసులు కాల్చే అవకాశం ఉన్నందున అగ్నిమాపక, వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని సూచించారు.టపాసుల దుకాణాల కేటాయింపులో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని, తాత్కాలిక నిర్మాణాల్లో మండే స్వభావం కలిగిన పదార్థాలను వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి దుకాణం మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండేలా చూడాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా వైరింగ్‌ను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి ధ్రువీకరించాలని ఆదేశించారు.
ప్రతి విక్రయ కేంద్రం వద్ద అగ్నిమాపక యంత్రాలు, ఇతర రక్షణ పరికరాలు సిద్ధంగా ఉంచాలని, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలందించేందుకు 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని, కాలిన గాయాలకు అవసరమైన మందులు, చికిత్సా సదుపాయాలను సిద్ధం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.
విక్రయ కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి పండుగ నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.వ్యాపార లాభాల కంటే ప్రజల ప్రాణాల భద్రతే ముఖ్యమని, ఆదాయం కోసం భద్రతా ప్రమాణాలను ఉల్లంఘిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలో రెండు ప్రాంతాల్లో టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, మరో అనువైన బహిరంగ ప్రదేశాన్ని గుర్తిస్తే అక్కడ కూడా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
ప్రజలు పర్యావరణానికి హాని కలిగించని హరిత టపాసులనే వినియోగించాలని, కాలుష్యాన్ని పెంచే టపాసులకు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణ, దీపావళి వేడుకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.
ఖమ్మం నగరంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు 224 దరఖాస్తులు అందాయని, అందుబాటులో ఉన్న దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు పోలీసుశాఖ ఏసీపీ వెల్లడించారు.
ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, డీపీవో వినోద్ కుమార్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు, టపాసుల దుకాణాల యజమానులు, విక్రయదారులు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

రాష్ట్ర స్థాయి ఖో-ఖో క్రీడాకారిణి రాధ కన్నుమూత

ప్రతిభావంతురాలి మృతి క్రీడా రంగానికి తీరని లోటు



జనగామ/చేర్యాల, నవంబర్ 03 (జర్నలిస్ట్ వార్త): చేర్యాల పట్టణ కేంద్రంలోని బీడీ కాలనీకి చెందిన రాష్ట్ర స్థాయి ఖో-ఖో క్రీడాకారిణి రాధ కన్నుమూశారు. ఆమె మృతి పట్ల పలువురు క్రీడాకారులు, ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాధ మృతి క్రీడా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.
ముస్త్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ నర్సయ్య శిష్యురాలైన రాధ ఖో-ఖో క్రీడలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎదిగారని కొనియాడారు. క్రీడల పట్ల ఆమెకు ఉన్న ఆసక్తి, ప్రతిభను గుర్తుచేసుకున్నారు.ఆమె మృతి పట్ల హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ గుప్తా, కోచ్ దామెర మల్లేశం, పీడీలు బాలరాజు, ప్రేమ్ కుమార్, రాజ్ కుమార్, సహచర క్రీడాకారిణులు రజిత, రేఖ, ప్రేమలత తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే నివారించవచ్చు

సర్పంచ్ రామంచ వెన్నెల దయాకర్



హసన్‌పర్తి/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అనంతసాగర్ గ్రామ సర్పంచ్ రామంచ వెన్నెల దయాకర్ సూచించారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో మంగళవారం ఆమె ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య వికాసంపై అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారణకు మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. వీఐఏ, వీఐఎల్ఐ పరీక్షల ద్వారా క్యాన్సర్‌కు సంబంధించిన ముందస్తు లక్షణాలను గుర్తించవచ్చని వివరించారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు వైద్యుల సూచన మేరకు కొల్పోస్కోపీ, బయాప్సీ వంటి తదుపరి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనుష, ఏపీఎం నారాయణ, ఉపసర్పంచ్ బండ దామోదర్ రెడ్డి, మహిళలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

67 మంది లబ్ధిదారులకు రూ.17.70 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆపద సమయంలో బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది

ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్





తల్లాడ/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): తల్లాడ మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.17,70,000 విలువైన 67 చెక్కులను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రాధాన్యమని, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జి. లక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, వైరా మాజీ మార్కెట్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో పట్టభద్రుల పాత్ర కీలకం

ఎమ్మెల్సీ ఓటరుగా ప్రతి పట్టభద్రుడు నమోదు చేసుకోవాలి

జనసేన నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి శివకోటి యాదవ్



నర్సంపేట/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): ప్రజాస్వామ్య పరిరక్షణలో పట్టభద్రుల పాత్ర ఎంతో కీలకమని జనసేన పార్టీ నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు శివకోటి యాదవ్ అన్నారు. వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఆధ్వర్యంలో నర్సంపేట డివిజన్‌లోని మహేశ్వరంలో గల శివాని పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని వివరించి, అర్హులైన ఉపాధ్యాయులు, పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివాని పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ గిరగాని రాహుల్, ప్రిన్సిపల్ మొలుగూరి సురేందర్, ఉపాధ్యాయ బృందం, జనసేన నాయకులు గంగుల రంజిత్, బొబ్బ పృథ్వీరాజ్, రోడ్డ శ్రీకాంత్, ఎలబోయిన డేవిడ్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకున్న నిందితుడు ఎట్టకేలకు పట్టుబడ్డాడు

2.400 కిలోల గంజాయి రవాణా కేసులో కీలక పరిణామం



కేసముద్రం/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):గంజాయి అక్రమ రవాణా కేసులో పోలీసుల తనిఖీల సమయంలో తప్పించుకుని పరారీలో ఉన్న నిందితుడిని నెల్లికుదురు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను కేసముద్రం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. సత్యనారాయణ, నెల్లికుదురు ఎస్సై కరుణాకర్ వెల్లడించారు.
మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 116/2026, ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(సి) రెడ్‌విత్ 20(బి)(ii)(బి) కింద నమోదైన కేసులో పరారీలో ఉన్న కావుగేరీ రాజు అలియాస్ మహబూబ్‌నగర్ (29)ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు హనుమాన్‌పురకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.విచారణలో నిందితుడు తన సహచరులతో కలిసి భద్రాచలం ప్రాంతం నుంచి సుమారు 2.400 కిలోల ఎండు గంజాయిని అధిక ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఆపిల్ కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్‌ను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందన్నారు.గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు ప్రజలను కోరారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నెల్లుట్లలో దూడలకు నట్టల నివారణ కార్యక్రమం



స్టేషన్ ఘన్‌పూర్/నవంబర్ 03 (జర్నలిస్ట్ వార్త): నెల్లుట్ల గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడలకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దూడలకు నట్టల నివారణ మందు తాగించారు.నట్టల నివారణ మందు ఇవ్వడం వల్ల దూడలు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు బరువు పెరుగుతాయని, నట్టల కారణంగా కలిగే అనారోగ్య సమస్యలను నివారించవచ్చని పశు వైద్యాధికారులు రైతులకు వివరించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు నిర్ణీత వ్యవధిలో నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ, ఉపసర్పంచ్ దామర కావ్య, మండల పశు వైద్యాధికారి డాక్టర్ జితేందర్, పశువైద్య సిబ్బంది శైలజ (వీఎల్ఓ), పాడి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు కంటే ఎత్తులో డ్రైనేజీ నిర్మాణం

కొద్దిపాటి వర్షానికే చెరువులుగా మారుతున్న రోడ్లు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై 20వ వార్డు ప్రజల ఆగ్రహం



కల్లూరు/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):
కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం స్థానికులకు శాపంగా మారింది. కల్లూరు 20వ వార్డులో కనీస ఇంజినీరింగ్ ప్రమాణాలు పాటించకుండా సైడ్ డ్రైనేజీలను సిమెంట్ రోడ్డు కంటే ఎత్తుగా నిర్మించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా వర్షపు నీరు డ్రైనేజీల్లోకి వెళ్లే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోతోంది. దీంతో కాలనీలోని రహదారులు చెరువులను తలపిస్తున్నాయి.
ఇళ్ల ముందు రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నీరు నిలవడంతో బయటకు వెళ్లేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.
ప్రజల సౌకర్యార్థం నిర్మించాల్సిన డ్రైనేజీలు సమస్యలకు కారణమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, డ్రైనేజీ నిర్మాణంలో ఉన్న లోపాలను సరిచేసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టినట్లు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని 20వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబానికి ముదిరాజ్ సేవా సమితి అండ

కుంభం రాజయ్య కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం



స్టేషన్ ఘన్‌పూర్/నవంబర్ 03 (జర్నలిస్ట్ వార్త):
స్టేషన్ ఘన్‌పూర్ పట్టణానికి చెందిన కుంభం రాజయ్య ముదిరాజ్ రెండు కిడ్నీలు పనిచేయక అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆ నిరుపేద కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య, పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెసరు రాజన్న దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దాతల సహకారంతో బాధిత కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించారు.
ఈ మేరకు పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య తదితరులు మంగళవారం మృతుడి స్వగృహానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, స్థానిక కుల పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు సింగారపు రామకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు వేరైనా ఆపద సమయంలో కుల బంధువులంతా ఒక్కటై బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ముదిరాజుల ఐక్యతకు, మానవత్వానికి ఈ సహాయ కార్యక్రమం నిదర్శనమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ ముదిరాజ్, స్థానిక కౌన్సిలర్లు పొన్నం స్వరూప, పెసరు కృష్ణవేణి సారయ్య, రాజయ్య ముదిరాజ్, సేవకులు దండు చిరంజీవి ముదిరాజ్, పట్టణ కుల పెద్దలు కుంభం గణేష్, సాంబరాజు, రాము, కుమారస్వామి, రవి, సుధాకర్, కుంభం మధు, కుంభం రామస్వామి, శంకర్, రాజు, బాబు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎమ్మెల్సీ ఆత్మీయ సమావేశం

పట్టభద్రులు, అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





హసన్‌పర్తి/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):
కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆత్మీయ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, తెలంగాణ తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటనారాయణ, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, కుడా చైర్మన్ గుండు సుధారాణి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎండీ మాయూబ్ తదితరులతో కలిసి ఆయన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

ఏపీలో టీడీపీ కూటమి ప్రభంజనం..

తెలంగాణ తెలుగు తమ్ముళ్లలో జోష్

తిరువూరు విజయంతో సరిహద్దు ప్రాంతాల్లో పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహం

కల్లూరు/నవంబర్ 03 (జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించడంపై ఖమ్మం జిల్లా తల్లాడ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా నాయకులు జాస్తి శ్రీనివాసరావు, కాకర్ల రంగారావు మాట్లాడుతూ ఏపీలో కూటమి సాధించిన విజయం ప్రజా మద్దతుకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా దక్షతకు నిదర్శనమని పేర్కొన్నారు.తెలంగాణ సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ తిరువూరు పురపాలక సంఘం ఎన్నికల్లోనూ టీడీపీ మహాకూటమి విజయం సాధించడం అభినందనీయమన్నారు. ఈ విజయంతో తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోని తెలుగు తమ్ముళ్లలో నూతన ఉత్సాహం నెలకొందని తెలిపారు.ఏపీలో టీడీపీ కూటమి సాధించిన విజయ స్ఫూర్తితో తెలంగాణలోనూ పార్టీని బలోపేతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కీలక రాజకీయ శక్తిగా ఎదిగేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజా



సమస్యలపై పోరాడుతూ ప్రజలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

తెలంగాణలో పార్టీ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు స్వతంత్ర అభ్యర్థులు, పార్టీ అభిమానులు, ఇతర పార్టీల నాయకులను కలుపుకొని ముందుకు సాగుతామని వెల్లడించారు. ప్రజలతో మమేకమవుతూ పార్టీ విస్తరణకు కృషి చేస్తామని చెప్పారు. తిరువూరు ఎన్నికల ప్రచారంలో సరిహద్దు ప్రాంతమైన కల్లూరు పరిసరాల టీడీపీ శ్రేణులు సైతం పాల్గొని కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశాయని తెలిపారు. విజయానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కొమ్మినేని నాగేశ్వరరావు, కట్ట గోపాలరావు, వాడపల్లి రాము, పతంగి హరీష్, నరపోగు ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొని కూటమి విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న సండ్ర

ఓటరు నమోదుపై నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.. పంట నష్టంపై తక్షణమే సర్వే చేపట్టాలి

తల్లాడ/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకంలో భాగంగా మండల ముఖ్య నాయకుల సమావేశం తల్లాడలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులను నేరుగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరితో ఓటు నమోదు చేయించే బాధ్యత నాయకులు తీసుకోవాలని సూచించారు. గత మూడు రోజులుగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ సర్వర్ బిజీగా ఉండటంతో ఓటరు నమోదు ప్రక్రియకు ఆటంకం ఏర్పడిందని, ఈ నేపథ్యంలో ఓటరు నమోదు గడువును పొడిగించాలని కోరారు.

రైతు సమస్యలపై ప్రభుత్వంపై విమర్శలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తి, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని సండ్ర వెంకట వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని నమోదు చేయడం లేదని విమర్శించారు. కరువు మండలాల ప్రకటనలోనూ స్పష్టత లేదని అన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు



ప్రారంభించకపోవడం, ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో క్వింటాల్ ధాన్యం ధర రూ.4,200 వరకు ఉండగా, ప్రస్తుతం వ్యాపారులు రూ.2,800కే కొనుగోలు చేస్తామని చెబుతున్నారని తెలిపారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ఇటీవల ఆర్నబ్, తాజాగా మురాస్ తుపాను ప్రభావంతో పత్తి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందంటూ సండ్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, తల్లాడ పట్టణ అధ్యక్షుడు సీవీఆర్, రైతు సమన్వయ ప్రచార కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, బీఆర్ఎస్ మండల నాయకులు కోడూరి వీరకృష్ణ, గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఇస్నేపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గాలివానలు, ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి -అధికారులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశం

మిర్యాలగూడ/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):

ఆకస్మిక గాలివానలు, రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివానలు, వర్షాల వల్ల పంటలకు జరిగిన నష్టాన్ని ఎప్పటికప్పుడు గుర్తించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. బాధిత రైతులకు అవసరమైన సహాయ



సహకారాలు అందించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో చోటుచేసుకునే వాతావరణ మార్పులను ముందుగానే అంచనా వేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గాలివానల సమయంలో విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, దెబ్బతిన్న స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమన్వయంతో పనిచేయాలని, రైతుల సంక్షేమం, ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. సమావేశంలో వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!: జగన్ వ్యంగ్యం

మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన వైసీపీ అధినేత జగన్

చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం

ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ

నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను హైజాక్ చేశారని విమర్శ

ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత స్పష్టమైందని వ్యాఖ్య

నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు.

చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు.



"ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు.

ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

డంపింగ్ యార్డుకు మరో మూడు ఎకరాల భూమి కేటాయింపు..

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు

స్టేషన్ ఘన్‌పూర్,/నవంబర్ 03 (జర్నలిస్ట్ వార్త): స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం సర్వే నంబర్ 504లో అదనంగా మూడు ఎకరాల భూమి కేటాయించినందుకు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం చైర్మన్ వినయ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో ఇప్పటికే డంపింగ్ యార్డు కోసం రెండు ఎకరాల భూమి ఉందని, మున్సిపాలిటీ అవసరాలకు అది సరిపోవడం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై



స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అదనంగా మరో మూడు ఎకరాల భూమి కేటాయించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి సహకరించి అదనపు భూమి కేటాయింపునకు కృషి చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్‌తో పాటు కమిషనర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నవంబర్ 6న చలో హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయాలి

సీఆర్‌డీ కార్యాలయం ఎదుట ధర్నాకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు



హసన్‌పర్తి/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వారిదేవ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 6న హైదరాబాద్‌లోని సీఆర్‌డీ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నాలో పాల్గొనాలని కోరారు.తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయకపోవడం విచారకరమని విమర్శించారు. ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, రోజువారీ కూలీని రూ.800కు పెంచాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు.నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించడంతోపాటు ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి జి. రాములు, మండల కార్యదర్శి మంద సుచందర్, మండల అధ్యక్షురాలు వేలు రజిత, మండల కమిటీ సభ్యురాలు చందన తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

దళితుల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం

జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్, అధ్యక్షుడు బొనగిరి రూపేష్



జనగామ/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త): దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) 20వ వార్షికోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్, అధ్యక్షుడు బొనగిరి రూపేష్ పిలుపునిచ్చారు. దళితుల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న డీహెచ్‌పీఎస్ 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు రోజుల్లో పట్టభద్రుల ఓటరు నమోదు పూర్తి చేయాలి

నాయకులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపు

మిర్యాలగూడ/నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను మరో మూడు రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా నాయకులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై



నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి వీడియో కాల్ ద్వారా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.గ్రామాలు, పట్టణాల్లో పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ నెల 6న రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మిర్యాలగూడ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు.

అర్హత ఉంటే రెండేళ్ల గ్రాడ్యుయేట్ వీసా

భారతీయ విద్యార్థులకు బ్రిటన్ బంపరాఫర్..

నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):

బ్రిటన్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులకు ఊరటనిచ్చే ప్రకటన వెలువడింది. ఎంపిక చేసిన అర్హత కలిగిన యూనివర్సిటీల్లో చదువు పూర్తి చేసిన అంతర్జాతీయ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ వీసా గడువును రెండేళ్లకు పెంచనున్నట్లు యూకే ప్రభుత్వం ప్రకటించింది. యూనివర్సిటీల నిబంధనల పాటింపు రికార్డు మెరుగ్గా ఉండటంతో పాటు, అక్కడ చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఆశాజనకంగా ఉన్నాయనే ప్రమాణాల ఆధారంగా ఈ అర్హతను నిర్ణయించనున్నారు. ఈ వివరాలను యూకే ప్రభుత్వం బడ్జెట్ పత్రంలో వెల్లడించింది.

2027 జనవరి 1 నుంచి బ్రిటన్‌లో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేసిన సాధారణ అంతర్జాతీయ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ వీసా గడువు రెండేళ్ల నుంచి 18 నెలలకు తగ్గనుంది. అయితే వలస నిబంధనలను పక్కాగా పాటించే, తమ విద్యార్థులకు మెరుగైన



ఉద్యోగ అవకాశాలు కల్పించే యూనివర్సిటీల్లో చదువు పూర్తి చేసినవారికి మాత్రం రెండేళ్ల వీసా ఇవ్వాలని బ్రిటన్ ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీంతో యూనివర్సిటీ అర్హతను బట్టి చదువు తర్వాత బ్రిటన్‌లో ఉండే గడువు మారనుంది.

చదువు పూర్తయిన తర్వాత బ్రిటన్‌లోనే ఉండి ఉద్యోగ అనుభవం సంపాదించాలనుకునే భారతీయ విద్యార్థులకు ఈ నిర్ణయం ఉపయోగపడనుంది. అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడంలో చదువు తర్వాత పని చేసే అవకాశం కీలకంగా మారిందని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇకపై యూనివర్సిటీ ఎంపికలో ర్యాంకింగ్స్‌తో పాటు ఆ సంస్థ నిబంధనల పాటింపు, విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడంలో దాని పనితీరును కూడా పరిశీలించాల్సి ఉంటుందని సూచిస్తున్నారు.

మరోవైపు, ప్రపంచంలోని టాప్ 150 యూనివర్సిటీల్లో అర్హత కలిగిన డిగ్రీలు పొందిన వారికి వర్తించే హై పొటెన్షియల్ ఇండివిడ్యువల్ వీసా పరిధిని కూడా బ్రిటన్ విస్తరించింది. ఈ పథకం కింద వీసాల సంఖ్యను కూడా పెంచనుంది. అయితే రెండేళ్ల గ్రాడ్యుయేట్ వీసాకు సంబంధించి 'హై కాంప్లయన్స్ యూనివర్సిటీ', 'మెరుగైన ఉద్యోగ ఫలితాలు' వంటి అర్హతలను ఎలా నిర్ణయిస్తారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ నిబంధనలు పారదర్శకంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ముందే వచ్చిన కాలుష్య సంక్షోభం.

. ఢిల్లీకి పాక్ పాగ సెగ

దీపావళికి ముందే ఢిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం

300 దాటిన గాలి నాణ్యత సూచీ..

'వెరీ పూర్' కేటగిరీకి చేరిక

భారత్‌తో పాటు పాకిస్థాన్‌లోని వ్యవసాయ వ్యర్థాల దహనాలే ప్రధాన కారణం

నాసా శాటిలైట్ డేటాతో బహిర్గతమైన వాస్తవాలు

కాలుష్య నియంత్రణకు గ్రాప్-2 చర్యలు అమలు

నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):

పండుగల సీజన్ సమీపిస్తుండగా, దేశ రాజధాని ఢిల్లీని మరోసారి వాయు కాలుష్యం కమ్మేసింది. గాలి నాణ్యత సూచీ (ూూ×) 300 మార్కును దాటడంతో 'వెరీ పూర్' కేటగిరీకి పడిపోయింది. దీపావళికి కొద్ది రోజుల ముందే ఈ పరిస్థితి నెలకొనడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భారత్‌లోని పంజాబ్, హర్యానాలతో పాటు పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోని




పంజాబ్ ప్రావిన్స్‌లో పెద్ద ఎత్తున జరుగుతున్న వ్యవసాయ వ్యర్థాల దహనమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన శాటిలైట్ డేటా ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తోంది. అక్టోబర్ 1 నుంచి 29 మధ్య పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఏకంగా 13,241 వ్యవసాయ వ్యర్థాల దహనాలను గుర్తించగా, అదే సమయంలో భారత పంజాబ్‌లో 3,158 దహనాలు నమోదయ్యాయి. వాయవ్య దిశ నుంచి వీస్తున్న గాలులు ఈ పొగను ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతానికి మోసుకొస్తున్నాయి. దీనికి తోడు, వాతావరణంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, గాలి వేగం మందగించడం వంటి కారణాలతో కాలుష్య కారకాలు గాలిలోనే చిక్కుకుపోతున్నాయి. స్థానిక కాలుష్యానికి ఈ పొగ తోడవడంతో పరిస్థితి మరింత దిగజారింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' (జీఆర్ఏపీ) స్టేజ్-2ను అమలులోకి తెచ్చారు. దీని కింద, రోడ్లపై నీళ్లు చల్లడం, యాంటీ-స్మాగ్ గన్‌ల వినియోగం, నిర్మాణ కార్యకలాపాలపై కఠిన నిఘా వంటి చర్యలు ముమ్మరం చేశారు. రాబోయే రోజుల్లో కూడా గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడం వల్ల కాలుష్యం మరింత ప్రమాదకర స్థాయికి చేరే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టెలికాం కంపెనీలకు ట్రాయ్ కొత్త రూల్స్..

కొత్త ఏడాది నుంచి అమలు

నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):

భారత టెలికాం రంగంలో కీలక సంస్కరణలకు 'టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా' (ట్రాయ్) శ్రీకారం చుట్టింది. ఒక నెట్‌వర్క్ నుంచి మరో నెట్‌వర్క్‌కు కాల్స్‌ను సజావుగా అనుసంధానం చేసే ఇంటర్‌కనెక్షన్ వ్యవస్థను ఆధునికీకరిస్తూ 'టెలికమ్యూనికేషన్ ఇంటర్‌కనెక్షన్ (మూడో సవరణ) రెగ్యులేషన్స్-2026'ను నేడు విడుదల చేసింది. ఈ కొత్త నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఈ మార్పుల ద్వారా కాల్ క్వాలిటీ మెరుగుపడటంతో పాటు నెట్‌వర్క్ సామర్థ్యం కూడా పెరగనుంది.ప్రస్తుతం షార్ట్ డిస్టెన్స్ ఛార్జింగ్ ఏరియా (ఎస్‌డీసీఏ), లాంగ్ డిస్టెన్స్ ఛార్జింగ్ ఏరియా (ఎల్‌డీసీఏ) స్థాయిలో ఉన్న ఇంటర్‌కనెక్షన్ పాయింట్లను ఇకపై 'లైసెన్స్డ్ సర్వీస్ ఏరియా' (ఎల్ఎస్ఏ) స్థాయికి మార్చనున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్‌ను మూడేళ్లలో దశలవారీగా ఎల్ఎస్ఏ స్థాయికి



బదిలీ చేయాలని ట్రాయ్ ఆదేశించింది. ఈ మార్పు వల్ల రూటింగ్ సులభతరం అవుతుంది, కాల్స్ కనెక్ట్ అయ్యే సమయం (లేటెన్సీ) తగ్గుతుంది, సర్వీసుల్లో విశ్వసనీయత పెరుగుతుంది.మరో కీలకమైన మార్పు ఏమిటంటే, మొత్తం ఇంటర్‌కనెక్షన్ వ్యవస్థను పాత ఈ1/టీడీఎం టెక్నాలజీ నుంచి ఆధునిక ఇంటర్నెట్ ప్రోటోకాల్ ఆధారిత టెక్నాలజీకి మార్చడం. కొత్తగా ఏర్పాటు చేసే అన్ని ఇంటర్‌కనెక్షన్లు తప్పనిసరిగా ఐపీ ఆధారితంగానే ఉండాలని ట్రాయ్ స్పష్టం చేసింది. ఇప్పటికే ఉన్న పాత టెక్నాలజీ పాయింట్లను కూడా మూడేళ్లలోపు పూర్తిగా ఐపీ టెక్నాలజీకి మార్చాల్సి ఉంటుంది. దీనివల్ల బ్యాండ్‌విడ్త్ వినియోగం మెరుగుపడి, కాల్ క్వాలిటీ గణనీయంగా పెరుగుతుంది.ఈ సవరణల్లో భాగంగా మరికొన్ని కొత్త నిబంధనలను కూడా ట్రాయ్ ప్రవేశపెట్టింది. టెలికం సంస్థలు తమ కార్యాచరణ అవసరాల కోసం పీఓఐలను స్వచ్ఛందంగా అప్పగించేందుకు (సరెండర్) వీలు కల్పించింది. గతంలో కేవలం డిస్‌కనెక్షన్ నిబంధన మాత్రమే ఉండేది. దీంతో పాటు ఇంటర్‌కనెక్షన్ ఛార్జీల చెల్లింపు ఆలస్యమైతే విధించే వడ్డీపై కూడా స్పష్టత ఇచ్చింది. ఎస్‌బీఐ ఒక ఏడాది ఎంసీఎల్ఆర్ రేటుకు 2% అదనంగా వడ్డీని వసూలు చేసుకోవచ్చు. బ్యాంక్ గ్యారంటీల కాలపరిమితిని 6 నెలల నుంచి 12 నెలలకు పొడిగించింది. ఈ నిబంధనల అమలును పర్యవేక్షించడానికి, ఉల్లంఘించిన సంస్థలపై దశలవారీగా ఆర్థిక జరిమానాలు విధించడానికి కూడా ఒక పటిష్ఠమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాయ్ తెలిపింది.

అమ్మా తీసుకెళ్లు అంటూ గుండెలు పిండేసిన చిన్నారి..

చివరికి తల్లిదండ్రుల చెంతకు!

నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):

జగిత్యాల జిల్లాలో తీవ్ర ఉత్కంఠ రేపిన మూడేళ్ల బాలుడు రుద్ర మహేశ్ కస్టడీ వివాదం సుఖాంతమైంది. తెలంగాణ హైకోర్టు, జిల్లా యంత్రాంగం జోక్యంతో చిన్నారిని దాదాపు మూడేళ్లుగా పెంచుకుంటున్న దంపతులకు అధికారులు అప్పగించారు. వారాల తరబడి అనుభవించిన వేదనకు తెరపడటంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

కరీంనగర్‌లోని శిశు సంరక్షణ కేంద్రంలో "అమ్మా, నన్ను ఇంటికి తీసుకెళ్లు.. నాకు భయంగా ఉంది!" అంటూ బాలుడు తన పెంపుడు తల్లి సరితను చూసి ఏడుస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. చిన్నారి ఆవేదన ప్రతి ఒక్కరినీ కదిలించింది.

జగిత్యాలకు చెందిన కాసారపు శ్రీనివాస్, సరిత దంపతులు సంతానం లేకపోవడంతో రుద్ర మహేశ్‌ను ఐదు రోజుల పసికందుగా ఉన్నప్పటి నుంచి పెంచుకుంటున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారమే

తాము దత్తత తీసుకున్నామని వారు చెబుతున్నారు. అయితే, ఈ దత్తతకు చట్టబద్ధత లేదని అధికారులు బాలుడిని వారి నుంచి వేరుచేసి కరీంనగర్‌లోని ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.


దీంతో బాలుడి కస్టడీ కోసం శ్రీనివాస్, సరిత దంపతులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. వారి వాదనలు విన్న న్యాయస్థానం, W.P. నెం. 31588/2026లో అక్టోబర్ 16న బాలుడి మధ్యంతర కస్టడీని తిరిగి వారికే అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 28న కోర్టు ఉత్తర్వులను శిశు సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ)కి సమర్పించినా, అప్పగింతలో జాప్యం జరిగిందని దంపతులు ఆరోపించారు. ఈ జాప్యంపై వారు నిన్న జగిత్యాల కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ ఘటనపై స్పందించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, హైకోర్టు ఆదేశాల ప్రకారమే బాలుడిని అప్పగిస్తామని హామీ ఇచ్చారు. సీడబ్ల్యూసీ ఆమోదం, పరిపాలనాపరమైన లాంఛనాల కారణంగానే జాప్యం జరిగిందని, సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయానికల్లా ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

కలెక్టర్ హామీ ఇచ్చిన కొద్ది గంటల్లోనే సోమవారం సాయంత్రం అధికారులు బాలుడిని శ్రీనివాస్, సరిత దంపతులకు అప్పగించారు. తాను ఎవరి వద్దకు వెళ్లాలని ఆరాటపడ్డాడో ఆ తల్లిదండ్రుల చేతుల్లోకి రుద్ర మహేశ్ చేరడంతో ఈ కథ సుఖాంతమైంది.

భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది: ఏపీఎస్డీఎంఏ అలర్ట్

నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):




దక్షిణ కోస్తాంధ్రపై ప్రభావం చూపుతున్న 'మురసు' తీవ్ర తుపాను కారణంగా రానున్న మూడు గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి, ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది.ప్రస్తుతం 'మురసు' తీవ్ర తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 6 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఇది బాపట్లకు 40 కి.మీ, ఒంగోలుకు 50 కి.మీ, విజయవాడకు 90 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో పోలవరం, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే, మన్యం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరుతో పాటు నెల్లూరు, కడప, నంద్యాల జిల్లాల్లోనూ అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు.

ఈ నేపథ్యంలో ఎన్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ కీలక సూచనలు జారీ చేశారు. "భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉంది. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటే ప్రయత్నం చేయవద్దు. ఆకస్మిక వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు.అయితే, 'మురసు' తుపాను క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ రోజు రాత్రి నుంచి ఈదురుగాలుల తీవ్రత కూడా తగ్గుముఖం పడుతుందని అంచనా వేశారు. అయినప్పటికీ, అధికార యంత్రాంగం నుంచి హెచ్చరికలు తొలగించే వరకు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

మరో వాణిజ్య నౌకపై దాడి.. భారతీయుడి మృతి..

వెంటనే దాడులు ఆపాలన్న భారత్

నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):




ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో ఓ నావికుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వాణిజ్య నౌకలు, వాటిలో పనిచేసే సామాన్య నావికులపై దాడులు వెంటనే ఆపాలని మరోసారి స్పష్టం చేసింది. అంతర్జాతీయ జలాల్లో నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని కోరింది.భారత జెండాతో ప్రయాణిస్తున్న 'ఎంఎస్‌వీ అల్ జుసుఫీ' అనే నౌక సోమవారం ఒమన్ తీరంలో లిమా ప్రాంతం సమీపంలో ప్రయాణిస్తుండగా దాడికి గురైంది. నౌకలో మొత్తం 14 మంది భారతీయులు ఉన్నారు. వారిలో 13 మందిని సురక్షితంగా రక్షించారు. మరో నావికుడు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని గుజరాత్‌కు చెందిన గంధర్ నహీమ్ అజీజ్‌గా గుర్తించారు. నౌకను గుర్తుతెలియని వైమానిక వస్తువు ఢీకొట్టినట్లు కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. అయితే దాడికి సంబంధించిన మరిన్ని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. ప్రాణాలతో బయటపడిన 13 మంది నావికులకు అవసరమైన సహాయం అందిస్తోంది. వారిని భారత్‌కు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. మృతుడి భౌతికకాయాన్ని స్వదేశానికి తరలించే ప్రక్రియ కూడా కొనసాగుతోంది.

ఒమన్ తీరంలో జరిగిన తాజా ఘటనతో అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో నౌకల భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి పరిసరాల్లో వాణిజ్య నౌకలపై దాడులు ఎక్కువవుతున్నాయి. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు 120కి పైగా వాణిజ్య నౌకలు దాడులకు గురైనట్లు అంతర్జాతీయ సముద్ర సంస్థ, యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ గణాంకాలను ఉటంకిస్తూ నివేదికలు వెల్లడించాయి. అక్టోబర్‌లోనే 29 నౌకలపై దాడులు జరిగినట్లు సమాచారం. వాణిజ్య నౌకలు, వాటిలో పనిచేసే నావికులపై దాడులు జరగడం తీవ్ర ఆందోళనకరమని భారత్ పేర్కొంది. అంతర్జాతీయ జలాల్లో నౌకల రాకపోకలు, వాణిజ్యానికి ఎలాంటి ఆటంకాలు కలగకూడదని స్పష్టం చేసింది. ఉద్రిక్తతలను తగ్గించేందుకు చర్చలు, దౌత్యపరమైన ప్రయత్నాలు జరగాలని కోరింది. సముద్ర మార్గాల్లో శాంతి, భద్రత పునరుద్ధరణకు అన్ని దేశాలు కృషి చేయాలని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

ట్రంప్‌కు అగ్నిపరీక్ష.. అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్

నవంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):



అమెరికా రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఈ ఎన్నికల ప్రక్రియ మంగళవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) మొదలైంది. న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, కనెక్టికట్ సహా పలు తూర్పు తీర రాష్ట్రాల్లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు పోలింగ్ మొదలవగా, ఓటు వేసేందుకు ప్రజలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలతో పాటు, సెనెట్‌లోని 100 స్థానాలకు గాను 35 సీట్లకు పోలింగ్ జరుగుతోంది. వీటితో పాటు 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 21 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటికే 5.9 కోట్ల మంది ముందస్తు ఓటింగ్ (ఙుఖతీశ్రీఎ ఎశీఅఅస్త్ర) లేదా మెయిల్-ఇన్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది.అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టి రెండేళ్ల పూర్తయిన నేపథ్యంలో, ఆయన పాలనకు ఈ ఎన్నికలను ఒక రెఫరెండంగా పరిగణిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, సరిహద్దు భద్రత, అక్రమ వలసలు, వాణిజ్య సుంకాల వంటి అంశాలు ఓటర్లను ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయి. అత్యధిక సర్వేల ప్రకారం ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి.ప్రస్తుతం కాంగ్రెస్‌లోని రెండు సభల్లో (ప్రతినిధుల సభ, సెనెట్) రిపబ్లికన్లకు స్వల్ప మెజార్టీ ఉంది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు కనీసం ఒక్క సభలోనైనా ఆధిపత్యం సాధిస్తే, అధ్యక్షుడు ట్రంప్ విధానపరమైన నిర్ణయాలకు, చట్టాల ఆమోదానికి అడ్డంకులు సృష్టించే అవకాశం లభిస్తుంది. అయితే, డెమోక్రాట్లు గెలిస్తే, వారు ప్రతిపాదించే ప్రతి బిల్లును తన వీటో అధికారంతో అడ్డుకుంటానని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. టెక్సాస్, మిచిగాన్, ఐయోవా వంటి కీలక రాష్ట్రాల్లో సెనెట్ స్థానాలకు తీవ్రమైన పోటీ నెలకొంది.పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం (నవంబరు 4) తెల్లవారుజాము 5.30 గంటల నుంచి ప్రాథమిక ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, భారీ సంఖ్యలో ఉన్న మెయిల్-ఇన్ బ్యాలెట్ల లెక్కింపు కారణంగా తుది ఫలితాలపై పూర్తి స్పష్టత రావడానికి కొన్ని రోజుల సమయం పట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఐసీసీ యాంటీ డోపింగ్ నిబంధనల ఉల్లంఘన..

ఐర్లాండ్ క్రికెటర్‌పై సస్పెన్షన్ వేటు!

ప్రిస్క్రిప్షన్ మందుల వినియోగంలో నిబంధనల ఉల్లంఘన.. తప్పిదాన్ని అంగీకరించిన రెబెక్కా స్టోకెల్.. ఐసీసీ విచారణ పూర్తయ్యే వరకు ఆటకు దూరం



డబ్లిన్: ఐర్లాండ్ మహిళా క్రికెటర్ రెబెక్కా స్టోకెల్ ఐసీసీ యాంటీ డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించినట్లు అంగీకరించడంతో స్వచ్ఛంద సస్పెన్షన్‌కు అంగీకరించారు. ప్రిస్క్రిప్షన్ మందుల వినియోగానికి సంబంధించిన నిబంధనలు పాటించకపోవడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) క్రమశిక్షణా విచారణ చేపట్టింది. 2026 జూన్ 23న పోటీల సమయంలో నిర్వహించిన డోపింగ్ పరీక్షలో ఆమె నమూనాలో నిర్దిష్ట పదార్థం ఉన్నట్లు తేలింది. అనంతరం ఐసీసీ నుంచి సమాచారం అందడంతో తన తప్పిదాన్ని ఆమె అంగీకరించారు. అక్టోబర్ 23 నుంచి స్వచ్ఛంద సస్పెన్షన్‌లోకి వెళ్లారు. విచారణ పూర్తయ్యే వరకు ఆమెపై ఈ నిషేధం కొనసాగనుంది. **పోటీ ప్రయోజనం కోసం కాదు..** తాను వినియోగించిన మందు ఆటలో అదనపు ప్రయోజనం పొందేందుకు ఉపయోగించినది కాదని, ఈ ఉల్లంఘన అనుకోకుండా జరిగిందని రెబెక్కా వెల్లడించారు. అయినప్పటికీ యాంటీ డోపింగ్ మార్గదర్శకాలను పాటించాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. తన తప్పును పూర్తిగా అంగీకరిస్తున్నానని, వీలైనంత త్వరగా తిరిగి ఐర్లాండ్ జట్టుకు ఆడాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. **109 అంతర్జాతీయ మ్యాచ్‌లు** 26 ఏళ్ల రెబెక్కా 2017లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. ఇప్పటివరకు ఐర్లాండ్ తరఫున 29 వన్డేలు, 80 టీ20లు కలిపి మొత్తం 109 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడారు. ఈ ఘటనపై ఐసీసీ తుది నిర్ణయం వెల్లడించాల్సి ఉంది. క్రమశిక్షణా విచారణ ముగిసిన తర్వాతే ఆమెపై విధించే శిక్షాకాలంపై స్పష్టత రానుంది.

భువనేశ్వర్ కుమార్ కెరీర్‌కు ముగింపు పలికినట్లేనా?

- న్యూజిలాండ్ సిరీస్‌లో పేలవ ప్రదర్శన.. భువీపై అశ్విన్ కీలక వ్యాఖ్యలు.. షమీకి జట్టులో అవకాశం ఇవ్వాలని సూచన



న్యూఢిల్లీ: భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ అంతర్జాతీయ క్రికెట్ భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన ఐదు టీ20ల సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో అతడి కెరీర్‌పై చర్చ మొదలైంది. నాలుగేళ్ల విరామం తర్వాత భారత జట్టులోకి తిరిగొచ్చిన భువీ తన పునరాగమనాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. **ఐపీఎల్ ఫామ్.. అంతర్జాతీయ స్థాయిలో కరువు!** ఐపీఎల్-2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున భువనేశ్వర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 16 మ్యాచ్‌ల్లో 28 వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతోనే నాలుగేళ్ల తర్వాత భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. అయితే న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో మాత్రం తన ఐపీఎల్ ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం ఒక వికెట్ మాత్రమే తీసి, ఓవర్లకు 11.50 పరుగుల చొప్పున సమర్పించుకున్నాడు. **భువీ పునరాగమనం కష్టమే: అశ్విన్** తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన అశ్విన్.. ఐపీఎల్‌లో కనిపించిన బౌలింగ్ వేగం, తీవ్రత న్యూజిలాండ్ సిరీస్‌లో కనిపించలేదని పేర్కొన్నాడు. భువీ తన ఫామ్‌ను నిరూపించుకోలేకపోయాడని, ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి బౌలింగ్ మధ్య చాలా తేడా ఉందని వ్యాఖ్యానించాడు. అతడి భారత జట్టు అధ్యాయం బహుశా ముగిసినట్లేనని, తిరిగి జట్టులోకి రావడం చాలా కష్టమని అభిప్రాయపడ్డాడు. **షమీకి అవకాశం ఇవ్వాలి** మరోవైపు సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ ప్రస్తుత ఫామ్‌పై అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. రంజీ ట్రోఫీలో షమీ నిలకడగా వికెట్లు తీస్తూ మంచి లయలో ఉన్నాడని తెలిపాడు. ప్రస్తుతం భువనేశ్వర్‌తో పోలిస్తే షమీ మెరుగైన బౌలింగ్ లయలో ఉన్నాడని, సెలక్టర్లు అతడి పేరును పరిశీలించాలని సూచించాడు. దీంతో భువీ అంతర్జాతీయ కెరీర్ కొనసాగింపుపై ఆసక్తికర చర్చ మొదలైంది.

మైదానంలో విషాదం.. గోల్‌కీపర్‌తో ఢీకొని స్పెయిన్ ఫుట్‌బాలర్ మృతి!

గోల్ కోసం పోరాడుతూ తీవ్ర ప్రమాదం.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత.. 30 ఏళ్ల ఆటగాడి మృతితో ఫుట్‌బాల్ ప్రపంచంలో విషాదం



మాడ్రిడ్: స్పెయిన్ ఫుట్‌బాల్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మ్యాచ్ ఆడుతుండగా ప్రత్యర్థి జట్టు గోల్‌కీపర్‌తో ఢీకొన్న టెనెరిఫే క్లబ్ ఆటగాడు జీసస్ డి మిగ్వెల్ (30) మృతి చెందాడు. సోమవారం జరిగిన స్పెయిన్ రెండో డివిజన్ మ్యాచ్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకోగా, మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. **మైదానంలోనే కుప్పకూలిన ఆటగాడు** టెనెరిఫే, ఎఫ్‌సీ అండోరా జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో చివరి నిమిషాల్లో బంతిని అందుకునేందుకు డి మిగ్వెల్ ముందుకు దూసుకెళ్లాడు. అదే సమయంలో అండోరా గోల్‌కీపర్ జీసస్ ఒవోనో తన గోల్‌పోస్ట్ నుంచి బయటకు వచ్చి బంతిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఇద్దరూ బలంగా ఢీకొనడంతో డి మిగ్వెల్ ఛాతీకి తీవ్ర గాయమై మైదానంలోనే స్పృహ కోల్పోయాడు. వెంటనే వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో మ్యాచ్‌ను నిలిపివేశారు. గోల్‌కీపర్‌కు రెడ్‌కార్డు చూపించారు. **చికిత్స పొందుతూ మృతి** ప్రమాదం తర్వాత డి మిగ్వెల్‌కు గుండె స్పందన ఆగిపోవడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించి స్పందనను పునరుద్ధరించారు. అనంతరం ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో చేర్చి చికిత్స అందించారు. తొలుత అతడి పరిస్థితి నిలకడగా ఉందని క్లబ్ ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత నాడీ సంబంధిత పరిస్థితి విషమించింది. చివరకు మంగళవారం ఉదయం 8 గంటలకు మరణించినట్లు టెనెరిఫే క్లబ్ అధికారికంగా వెల్లడించింది. **ఫుట్‌బాల్ ప్రపంచం సంతాపం** డి మిగ్వెల్ మృతిపై టెనెరిఫేతో పాటు ఎఫ్‌సీ అండోరా, బార్సిలోనా, రియల్ మాడ్రిడ్ తదితర క్లబ్‌లు సంతాపం వ్యక్తం చేశాయి. స్పెయిన్ ఫుట్‌బాల్ సమాఖ్య కూడా నివాళిగా మంగళవారం జరగాల్సిన కోపా డెల్ రే, కోపా డెల్ రీనా మ్యాచ్‌లను వాయిదా వేసింది. 2025లో టెనెరిఫే జట్టులో చేరిన డి మిగ్వెల్ మృతి ఫుట్‌బాల్ అభిమానులను కలచివేసింది.

ఐపీఎల్-2027లో సంచలన ట్రేడ్ డీల్!

● ముంబైని వీడనున్న హార్దిక్ పాండ్యా? ● పంజాబ్ కింగ్స్ గురి స్టార్ ఆల్‌రౌండర్‌పై.. ప్రతిగా అర్ష్‌దీప్ సింగ్, విష్ణు వినోద్‌ను ఇచ్చేందుకు ప్రతిపాదన.. ఇరు ఫ్రాంచైజీల మధ్య కీలక చర్చలు!



న్యూఢిల్లీ: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందే భారత క్రికెట్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఆటగాళ్ల బదిలీలకు సంబంధించి ఫ్రాంచైజీల మధ్య చర్చలు మొదలవడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా ముంబై ఇండియన్స్ కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్ జట్టులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వస్తున్న వార్తలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఈ ఒప్పందంలో భాగంగా పంజాబ్ తన కీలక పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ విష్ణు వినోద్‌ను ముంబై ఇండియన్స్‌కు ఇచ్చే ప్రతిపాదన చేసినట్లు సమాచారం. ఈ భారీ ట్రేడ్ డీల్ నిజమైతే ఐపీఎల్ జట్ల కూర్పులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. **హార్దిక్‌పై పంజాబ్ ప్రత్యేక ఆసక్తి** పంజాబ్ కింగ్స్ ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ హార్దిక్ పాండ్యాను జట్టులోకి తీసుకోవడంపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించగల ఆల్‌రౌండర్ కావడంతో హార్దిక్ తమ జట్టుకు ఉపయోగపడతాడని పంజాబ్ యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. గత సీజన్లలో జట్టుకు అవసరమైన సమయంలో ఆల్‌రౌండర్ల సేవలు కీలకంగా మారిన నేపథ్యంలో హార్దిక్‌ను తీసుకోవడం ద్వారా జట్టు సమతూకాన్ని పెంచుకోవాలని చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ బదిలీపై ఇరు జట్ల మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ తుది ఒప్పందం కుదిరినట్లు అధికారికంగా ప్రకటించలేదు. **అర్ష్‌దీప్ సింగ్ ముంబైకి?** ఈ ట్రేడ్ ప్రతిపాదనలో అర్ష్‌దీప్ సింగ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. పంజాబ్ కింగ్స్‌కు ఎన్నో సీజన్లుగా సేవలందిస్తున్న అతడు భారత జట్టులోనూ కీలక పేసర్‌గా గుర్తింపు పొందాడు. ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌లో కొత్త బంతితో పాటు డెత్ ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అర్ష్‌దీప్ సొంతం. అతడిని జట్టులోకి తీసుకుంటే ముంబై ఇండియన్స్ బౌలింగ్ విభాగం మరింత బలోపేతం అవుతుందని అంచనా. మరోవైపు పంజాబ్ జట్టు అర్ష్‌దీప్‌ను వదులుకోవడం అంత సులభమైన నిర్ణయం కాదనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. **విష్ణు వినోద్ కూడా ట్రేడ్‌లో భాగమే!** అర్ష్‌దీప్‌తో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ విష్ణు వినోద్ పేరును కూడా ఈ ఒప్పందంలో చేర్చినట్లు వార్తలు వస్తున్నాయి. వికెట్ కీపింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ ఉపయోగపడే ఆటగాడిగా విష్ణు వినోద్‌కు గుర్తింపు ఉంది. ముంబై జట్టులో వికెట్ కీపింగ్ విభాగానికి అదనపు బలం చేకూర్చే అవకాశం ఉంది. హార్దిక్‌ను తీసుకునేందుకు పంజాబ్ ఇద్దరు ఆటగాళ్లను ఇచ్చే ప్రతిపాదన చేయడం ఈ వ్యవహారంపై ఆసక్తిని మరింత పెంచింది. **హార్దిక్ ఫిట్‌నెస్‌పైనా చర్చ** మరోవైపు హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ కూడా ఈ ట్రేడ్ చర్చల్లో కీలక అంశంగా మారింది. గతంలో గాయాల కారణంగా అతడు పలుమార్లు ఆటకు దూరమయ్యాడు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ సేవలందించే ఆల్‌రౌండర్‌గా హార్దిక్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే అతడి శారీరక దృఢత్వం, నిరంతరంగా మ్యాచ్‌లు ఆడగల సామర్థ్యం జట్టుకు కీలకం కానున్నాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకునే ఇరు ఫ్రాంచైజీలు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. **నవంబర్ 17లోగా స్పష్టత వచ్చేనా?** ఐపీఎల్-2027కు సంబంధించి ఆటగాళ్ల రిటెన్షన్ గడువు సమీపిస్తుండటంతో ఈ ట్రేడ్ వ్యవహారంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. నవంబర్ 17లోగా ఆటగాళ్ల బదిలీపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే చర్చలు జరుగుతున్నాయన్న వార్తలకు, అధికారికంగా ఒప్పందం ఖరారైన విషయానికి మధ్య తేడా ఉంది. ఇరు ఫ్రాంచైజీల నుంచి ప్రకటన వెలువడే వరకు ఈ బదిలీని ఖరారైన వ్యవహారంగా భావించలేం. ఒకవేళ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌లోకి వెళితే ఆ జట్టుకు అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ అందుబాటులోకి వచ్చినట్లవుతుంది. అదే సమయంలో అర్ష్‌దీప్ సింగ్ ముంబై జట్టులో చేరితే ఆ జట్టు పేస్ బౌలింగ్‌కు కొత్త బలం చేకూరుతుంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలుస్తుందా? లేక చర్చలకే పరిమితమవుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఐపీఎల్-2027కు ముందే ఈ స్టార్ ఆటగాళ్ల బదిలీ వ్యవహారం క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ రేపుతోంది.

సెలెక్టర్ల తీరుపై సర్ఫరాజ్ ఖాన్ అసంతృప్తి!

- వరుసగా పరుగులు చేస్తున్నా జట్టులో చోటేది? విదేశీ గడ్డపైనా సెంచరీలు సాధించా ప్రతిసారీ కష్టపడటానికి కారణమేంటని ఆవేదన



ముంబై: భారత టెస్టు జట్టులో చోటు దక్కకపోవడంపై యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా పరుగులు సాధిస్తున్నప్పటికీ సెలెక్టర్లు తనను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందాడు. భారత జట్టులోకి రావడానికి ప్రతిసారీ కష్టపడుతున్నా అవకాశాలు రాకపోవడంతో కొన్నిసార్లు ఎందుకు ఇంత కష్టపడాలని తనను తాను ప్రశ్నించుకుంటున్నానని తెలిపాడు. **విదేశాల్లోనూ పరుగులు సాధించా!** తనను భారత పరిస్థితుల్లో మాత్రమే ఆడగల బ్యాటర్‌గా చూస్తున్నారని సర్ఫరాజ్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాలో భారత్-ఏ తరఫున 63 బంతుల్లో సెంచరీ, ఇంగ్లండ్‌లో 76 బంతుల్లో శతకం సాధించిన విషయాన్ని గుర్తుచేశాడు. విదేశీ గడ్డపై కూడా పరుగులు చేయగల సామర్థ్యం తనకు ఉందని స్పష్టం చేశాడు. అయితే సెలెక్టర్ల ఆలోచన వారి నిర్ణయమని, తన పని క్రికెట్ ఆడటమేనని పేర్కొన్నాడు. **తండ్రే తనకు స్ఫూర్తి** 2024లో న్యూజిలాండ్‌తో చివరిసారిగా భారత్ తరఫున టెస్టు ఆడిన సర్ఫరాజ్.. ఇటీవల శ్రీలంక పర్యటనకు ఎంపికైనా తుది జట్టులో అవకాశం దక్కించుకోలేకపోయాడు. న్యూజిలాండ్‌తో భారత్-ఏ పర్యటనకు కూడా ఎంపిక కాలేదు. అయినప్పటికీ దేశవాళీ క్రికెట్‌లో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. తన తండ్రి నౌషాద్ ఖాన్ కష్టపడుతున్న తీరు చూసి ప్రతిరోజూ ఉదయం ఐదు గంటలకే సాధనకు వెళ్తున్నానని చెప్పాడు. **22 కిలోల బరువు తగ్గిన బ్యాటర్** ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టిన సర్ఫరాజ్ తన బరువును 97 కిలోల నుంచి 77 కిలోలకు తగ్గించుకున్నాడు. ఎవరూ ప్రత్యేకంగా చెప్పకపోయినా తన ఆటతీరును మెరుగుపరుచుకోవాలనే ఉద్దేశంతో ఈ మార్పు చేసుకున్నట్లు వెల్లడించాడు. ముంబై తరఫున రంజీ ట్రోఫీలో రైల్వేస్‌తో జరిగిన మ్యాచ్‌లో 55 పరుగులు సాధించాడు. భారత జట్టులో అవకాశం వచ్చినా, రాకపోయినా క్రికెట్ ఆడటం మాత్రం కొనసాగిస్తానని స్పష్టం చేశాడు.

నిధుల కొరతతో భారత బ్యాడ్మింటన్ స్టార్లకు కష్టాలు!

సొంత డబ్బులతో యూరప్ టోర్నీలు ఆడిన సింధు, లక్ష్యసేన్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులు నిలిపివేత.. ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులూ ఆటగాళ్లపైనే.. కోచ్‌లు లేకుండానే బరిలోకి పలువురు షట్లర్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికలపై భారత కీర్తిప్రతిష్ఠలను పెంచుతున్న బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ఊహించని ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దేశం తరఫున ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పాల్గొనేందుకు యూరప్ పర్యటనకు వెళ్లిన భారత షట్లర్లకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) నుంచి నిధులు అందకపోవడంతో సొంత డబ్బులతోనే పోటీల్లో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, స్టార్ షట్లర్ లక్ష్యసేన్ సహా పలువురు ఆటగాళ్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఫిన్లాండ్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో వరుసగా జరిగిన నాలుగు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనేందుకు వెళ్లిన భారత బృందానికి ప్రయాణం, భోజనం, వసతి ఖర్చుల కోసం నిధులు అందకపోవడం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. **చివరి నిమిషంలో నిధులు నిలిపివేత** భారత బ్యాడ్మింటన్ బృందం అక్టోబర్ 6న ఫిన్లాండ్‌లోని వాంటాలో ప్రారంభమైన ఆర్కిటిక్ ఓపెన్ టోర్నీతో యూరప్ పర్యటనను ప్రారంభించింది. అయితే ఈ పోటీకి కొద్ది రోజుల ముందే పర్యటనకు అవసరమైన నిధులు విడుదల కావడం లేదని ఆటగాళ్లకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ ఆర్థిక ఏర్పాట్లు చేసుకునేందుకు కూడా వారికి తగిన సమయం లేకుండా పోయింది. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) మొదటి టోర్నీకి వసతి ఏర్పాట్లు చేస్తామని చెప్పినప్పటికీ, మిగిలిన పోటీలకు ప్రయాణం, భోజనం, బస తదితర ఖర్చులను ఆటగాళ్లే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

‘రామాయణ‘ సినిమాకు భారీ ఊరట..

పైరసీపై బాంబే హైకోర్టు ఉక్కుపాదం



భారత సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్‘ చిత్రానికి బాంబే హైకోర్టులో భారీ ఊరట లభించింది. సినిమా విడుదలకు ముందే పైరసీ భూతం నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ నిర్మాతలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, సినిమాను అనధికారికంగా రికార్డ్ చేయడం, స్ట్రీమింగ్ చేయడం, లేదా ఏ ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో హోస్ట్ చేయడాన్ని నిషేధిస్తూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది.

గాడ్‌పవర్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కాపీరైట్ హక్కుల ఉల్లంఘన జరగవచ్చనే బలమైన ఆందోళనతో వారు ‘ఆనంద్ అండ్ నాయక్‘ న్యాయ సంస్థ ద్వారా కోర్టును ఆశ్రయించారు. సినిమా స్క్రిప్ట్, పాత్రలు, ఫుటేజ్, పాటలు, రికార్డింగ్‌లతో సహా అన్ని అంశాలపై తమకు పూర్తి హక్కులు ఉన్నాయని, వాటిని కాపాడాలని పిటిషన్‌లో కోరారు. కేవలం ఆహ్వానితుల కోసం ప్రదర్శించిన రెండు ట్రైలర్లను కొందరు రహస్యంగా రికార్డ్ చేసి డిజిటల్ నెట్‌వర్క్‌లలో వ్యాప్తి చేశారని నిర్మాతలు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సినిమా మొదటి భాగాన్ని సుమారు రూ. 2,000 కోట్లతో, రెండు భాగాలను కలిపి మొత్తం రూ. 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు కోర్టుకు తెలిపారు. దీనిపై జస్టిస్ మాధవ్ జమ్దార్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. “నిర్మాతలకు నిజమైన, బలమైన ఆందోళనలు ఉన్నాయని ప్రాథమికంగా అర్థమవుతోంది“ అని వ్యాఖ్యానించింది. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థలు సినిమాను పైరసీ చేయకుండా ‘డైనమిక్ ఇంజంక్షన్‘ ఉత్తర్వులు జారీ చేసింది.

అభ్యంతరకర లింకులు లేదా మిర్రర్ సైట్లను తమ దృష్టికి తెచ్చిన వెంటనే వాటిని బ్లాక్ చేయాలని లేదా తొలగించాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు (ఐఎస్‌పీ), సోషల్ మీడియా సంస్థలను ఆదేశించింది. దీనిపై గూగుల్, ఇతర సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులు కూడా అభ్యంతరం చెప్పలేదు.

వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ఆధారంగా నితేష్ తివారీ ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. నమిత్ మల్హోత్రా, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్నారు. కేసు తదుపరి విచారణను డిసెంబర్ 16కి వాయిదా వేసిన కోర్టు, అప్పటివరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది.

గేమింగ్ రంగంలోకి సూపర్ స్టార్..

షాట్‌గన్ గేమ్స్‌లో మహేశ్ బాబు పెట్టుబడి



ప్రముఖ సినీ నటుడు మహేశ్ బాబు మరో కొత్త వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాడు. ఆయన తాజాగా గేమింగ్ పరిశ్రమలో పెట్టుబడిదారుడిగా మారాడు. ముంబైకి చెందిన ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ‘షాట్‌గన్ గేమ్స్‘లో మహేశ్ వ్యూహాత్మక పెట్టుబడి పెట్టినట్టు ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ కంపెనీ అంతర్జాతీయ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని పీసీ, కన్సోల్ గేమ్స్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ భాగస్వామ్యాన్ని షాట్‌గన్ గేమ్స్ సహ వ్యవస్థాపకులు జీత్ చందన్, విదిత్ మెహతా ధ్రువీకరించారు. ఈ ఒప్పందంలో భాగంగా అమెరికా, యూరప్, యూకే వంటి గ్లోబల్ మార్కెట్ల కోసం ‘టేక్‌డౌన్ జెనెసిస్‘ పేరుతో ఒక యాక్షన్-అడ్వెంచర్ గేమ్‌ను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రముఖ దర్శకుడు విక్కీ అరోరా నేతృత్వంలో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. ప్రపంచ స్థాయి పీసీ, కన్సోల్ గేమ్స్‌ను భారత్ కూడా తయారు చేయగలదని నిరూపించడమే తమ లక్ష్యమని కంపెనీ వ్యవస్థాపకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ బాబు మాట్లాడుతూ, దేశంలో సృజనాత్మక ప్రతిభకు ఎలాంటి కొదవ లేదని అన్నాడు. “కొత్త రంగంలోకి ప్రవేశించడం సంతోషంగా ఉంది. భారతీయ టాలెంట్‌పై నాకు పూర్తి నమ్మకం ఉంది“ అని ఆయన వ్యాఖ్యానించాడు. ఇప్పటికే సినిమా నిర్మాణం, థియేటర్లు, హెల్త్ అండ్ వెల్‌నెస్ వంటి పలు వ్యాపారాల్లో ఉన్న మహేశ్ బాబు, తాజాగా గేమింగ్ రంగంలోకి ప్రవేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ పెట్టుబడి విలువ ఎంత అనే వివరాలను ఇరుపక్షాలు

రాధికా ఆప్టే కామెంట్స్..

సినిమా ఒప్పుకునే ముందు తెలియదా?



తెలుగు సినిమా ఇండస్ట్రీపై బాలీవుడ్ హీరోయిన్లు విమర్శలు చేయడం కొత్తేమీ కాదు. గతంలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు ఎంతటి వివాదానికి దారితీశాయో తెలిసిందే. ఇప్పుడు రాధికా ఆప్టే కూడా అలాంటి కామెంట్స్‌తో నెటిజన్ల నుంచి ప్రశ్నలు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ వ్యవహారంలో హీరోయిన్ల అభ్యంతరాలను పూర్తిగా కొట్టిపారేయలేం. అదే సమయంలో సినిమాల్లో నటించడానికి అంగీకరించిన తర్వాత కొన్నేళ్లకు వాటిపై విమర్శలు చేయడాన్ని కూడా కొందరు తప్పుబడుతున్నారు. రాధికా ఆప్టే ఇటీవల అక్క ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. అందులో తన పాత్రను సొంత బంధువుతో పెళ్లికి సిద్ధం చేయడం, తనకంటే వయసులో చాలా పెద్ద హీరోతో నటించడం, సినిమా మధ్యలోనే పాత్రను చంపేయడం వంటి అంశాలను ప్రస్తావించారు. ఆమె అక్కడ ఏదో కామెడీగా, సినిమా నచ్చనట్లు అదే రొటీన్ అన్నట్లు హైలెట్ చేయడ ఓ వర్గం నెటిజన్స్ కు నచ్చడం లేదు. ఈ వ్యాఖ్యలపై కొందరు నెటిజన్లు స్పందిస్తూ అసలు కథ నచ్చనప్పుడు సినిమా ఎందుకు ఒప్పుకున్నారని ప్రశ్నిస్తున్నారు. హీరో ఎవరో, తన పాత్ర ఏంటో ముందే తెలుసుకునే అవకాశం ఉంటుంది కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. గతంలో తాప్సీ కూడా తెలుగు సినిమా షూటింగ్ అనుభవాలపై ఇలాంటి విమర్శలే చేశారు. తన నాభిపై కొబ్బరికాయ వేసి పాట చిత్రీకరించడాన్ని ఓ ఇంటర్వ్యూలో సరదాగా ప్రస్తావించడం అప్పట్లో వివాదమైంది. ఆ తర్వాత తన ఉద్దేశం దర్శకుడిని అవమానించడం కాదని వివరణ ఇచ్చారు. ఈ ఏడాది కూడా దక్షిణాది సినిమాల్లో హీరోయిన్ల గ్లామర్‌కు ఇచ్చే ప్రాధాన్యం, షూటింగ్ సమయంలో ఎదురైన ఇబ్బందుల గురించి మాట్లాడారు. ఇప్పుడు రాధికా వ్యాఖ్యలతో మరోసారి అలాంటి ప్రశ్నలే వినిపిస్తున్నాయి. అయితే నెటిజన్లు అడుగుతున్న ప్రశ్నలోనూ పాయింట్ ఉంది. కథలోని కొన్ని అంశాలు నచ్చకపోతే సినిమా ఒప్పుకునే ముందే అభ్యంతరం చెప్పవచ్చు. ముఖ్యంగా సీనియర్ హీరోతో నటించడం విషయంలో వయసు తేడా ముందే తెలిసే అవకాశం ఉంటుంది.

కానీ షూటింగ్ సమయంలో జరిగే ప్రతి విషయం ముందుగానే నటీనటులకు తెలుస్తుందని అనుకోలేం. కథ చెప్పినప్పుడు ఉన్న సన్నివేశాలు సెట్స్ మీదకు వెళ్లాక మారవచ్చు. కొన్ని సందర్భాల్లో దర్శకుడి నిర్ణయాలను వ్యతిరేకించే పరిస్థితి కూడా హీరోయిన్లకు ఉండకపోవచ్చు. ఒక సినిమాలో నటించినంత మాత్రాన అందులోని ప్రతి సన్నివేశాన్ని వ్యక్తిగతంగా సమర్థించినట్లు కాదు. అలాగే తనకు ఎదురైన అనుభవాన్ని చెప్పడం తప్పు కూడా కాదు. కానీ ఒకరిద్దరు దర్శకులతో ఎదురైన పరిస్థితులను మొత్తం తెలుగు ఇండస్ట్రీకి ఆపాదిస్తే మాత్రం అభ్యంతరాలు రావడం సహజం. ఎందుకంటే హీరోయిన్లకు మంచి పాత్రలు ఇచ్చిన దర్శకులు, మహిళా పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చిన సినిమాలు కూడా తెలుగులో చాలానే ఉన్నాయి. రాధికా గతంలో తెలుగు సినిమా సెట్స్‌లో తనకు ఎదురైన ఇబ్బందులను చెప్పడంతో పాటు అక్కడి వ్యక్తులు తనను ఆప్యాయంగా చూసుకున్న సందర్భాలను కూడా గుర్తుచేసుకున్నారు. మరోవైపు స్థానిక నటీమణులకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలనే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు.

‘మెగా’ ఇంట్లో పెళ్లి బాజాలు.

. సాయి దుర్గా తేజ్ పెళ్లి ఫిక్స్?..

డిసెంబర్‌లో వివాహ ముహూర్తం?



టాలీవుడ్‌లో మరోసారి పెళ్లిళ్ల సందడి మొదలైంది. ఒకేసారి ఇద్దరు యువ హీరోల పెళ్లిళ్ల విషయంపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మెగా హీరో సాయి దుర్గా తేజ్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నారని ప్రచారం జోరుగా సాగుతుండగా, మరో యంగ్ హీరో తేజ సజ్జా తన పెళ్లి వార్తను అధికారికంగా ప్రకటించారు.

మెగా కుటుంబంలో మరో పెళ్లి వేడుకకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. సాయి దుర్గా తేజ్ వివాహం చేసుకోబోతున్నారంటూ వస్తున్న వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ప్రచారం ప్రకారం, నవంబర్ 5న హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య సాయి తేజ్ నిశ్చితార్థం జరగనున్నట్లు సమాచారం. అయితే, ఆయన వివాహం చేసుకోబోయే అమ్మాయి వివరాలను చాలా గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఇక, డిసెంబర్ 10న వివాహం జరిపి, ఆ తర్వాత సినీ ప్రముఖుల కోసం ప్రత్యేకంగా రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సాయి తేజ్ ‘సంబరాల ఏటి గట్టు’ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ వార్తలపై మెగా కుటుంబం నుంచి గానీ, సాయి తేజ్ నుంచి గానీ అధికారిక ప్రకటన వస్తేనే పూర్తి స్పష్టత రానుంది.

టైగర్ ష్రాఫ్ ఘటన ఎఫెక్ట్..

భద్రతా వలయంలోకి బాలీవుడ్.. బిక్కుబిక్కుమంటున్న స్టార్లు!



బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ పై జరిగిన కాల్పుల ఘటన యావత్ సినీ పరిశ్రమను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ సంఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన సినీ ప్రముఖులు తమ భద్రతపై దృష్టి సారించారు. ఇప్పటికే పలువురు స్టార్లకు బెదిరింపులు వచ్చినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో, తాజాగా నటుడు తుషార్ కపూర్‌కు కూడా బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. అయితే, ఈ బెదిరింపులు నిజమా? లేక ఆకతాయిల పనా? అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో బాలీవుడ్‌లో భయానక వాతావరణం నెలకొంది. ఈ ఘటన తర్వాత సెలబ్రిటీల నుంచి భద్రత కవరేజీ కోసం డిమాండ్ పెరిగిందని నటుడు, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వాహకుడు రోనిత్ రాయ్ ‘ఎన్డీటీవీ‘తో మాట్లాడుతూ ధ్రువీకరించారు. “ఇది నిజమే.. సెలబ్రిటీల నుంచి భద్రతను పెంచాలనే డిమాండ్ వస్తోంది. ఇదంతా ముందు జాగ్రత్త చర్యల్లో భాగమే. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా, సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నారు“ అని ఆయన వివరించారు. పలువురు ప్రముఖులకు భద్రత కల్పిస్తున్న సిబ్బంది కూడా కాల్పుల ఘటన తర్వాత తమ క్లయింట్ల భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు.

ఈ ఘటన పరిశ్రమలోని నటీనటులు, దర్శకులు, నిర్మాతల్లో భయాన్ని నింపిందని ‘ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్‘ (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) అధ్యక్షుడు బీఎన్ తివారీ అన్నారు. ఎన్డీటీవీతో ఆయన మాట్లాడుతూ.. “ప్రతి ఒక్కరూ భయపడుతున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఈ ఘటన జరిగింది. పట్టపగలు, జనం మధ్యలో, పోలీస్ స్టేషన్ ముందే కాల్పులు జరగడం సహజంగానే భయాన్ని సృష్టించింది. కళాకారులు అందరూ అప్రమత్తంగా ఉన్నారు. ప్రాణం అందరికీ విలువైందే కాబట్టి ఈ భయం అందరిపైనా ప్రభావం చూపుతోంది“ అని అన్నారు.

“దీన్ని భయం అనడం కంటే, ముందు జాగ్రత్త చర్య అనడం సరైంది. అనవసరంగా బయట ప్రదేశాలకు వెళ్లడం, కారణం లేకుండా ఇతరులను కలవడం వంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండటం మంచిది“ అని తివారీ సూచించారు. భద్రత పెరిగిన విషయం ప్రముఖుల బహిరంగ కార్యక్రమాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి ఆదివారం అభిమానులతో ముచ్చటించే అమితాబ్ బచ్చన్, ఈసారి తన జుహూ నివాసం వెలుపల ఒక బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ ఎన్‌క్లోజర్ వెనుక నుంచి అభివాదం చేశారు. ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్ దగ్గరుండి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిన్న షారుఖ్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసం ‘మన్నత్‘ వద్ద కూడా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి, అభిమానులను మొదట బంగ్లా దగ్గరకు అనుమతించలేదు. తర్వాత షారుఖ్ తన కుటుంబంతో కలిసి టెర్రస్‌పైకి వచ్చి, అభిమానులకు చాలా దూరం నుంచే అభివాదం చేశారు. సాధారణంగా చేసే విధంగా కాంపౌండ్ వాల్ దగ్గరకు రాలేదు.

ఇదిలా ఉంటే.. టైగర్ ష్రాఫ్ ఇంటి వద్ద కాల్పులకు పాల్పడిన షూటర్లు.. అమితాబ్ బచ్చన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, అక్షయ్ కుమార్ వంటి ఇతర స్టార్ల ఇళ్ల వద్ద కూడా రెక్కీ నిర్వహించినట్లు వచ్చిన నివేదికలు ఆందోళనను మరింత పెంచాయి. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా సీనియర్ వర్కర్స్ అసోసియేషన్ బాలీవుడ్ ప్రముఖులకు పటిష్ఠమైన భద్రత కల్పించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసింది. మొత్తం మీద ఈ కాల్పుల ఘటన సినీ పరిశ్రమలో వ్యక్తిగత భద్రత అనే అంశాన్ని మరోసారి తీవ్రంగా చర్చకు తెచ్చింది.